సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం | 26 | సెప్టెంబర్ | 2025



అన్నదాన కష్టాలు
మావుళ్లమ్మ దేవస్థానంలో అన్నదాన కష్టాలు వెంటాడుతున్నాయి. ఇరుకు గదిలో భక్తులు **ఒకరిపై ఒకరూ పడుతూ అన్నప్రసాదం తినాల్సి వస్తోంది.** 10లో ▸



అదును చూసి దోచేస్తున్నారు!
వరుస తుపాన్లు, వాయుగుండాలతో రైతు హడలెత్తిపోతుంటే దళారులు అదును చూసి అయినకాడికి ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ దోపిడీ చేస్తున్నారు. 10లో ▸



పరిమితి మేరకు వర్జీనియా సాగు
పొగాకు బోర్డు సూచించిన పరిమితి మేరకు మాత్రమే వర్జీనియా పండించాలని పొగాకు **బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.విశ్వశ్రీ రైతులకు సూచించారు.** 10లో ▸

సర్కారుపై సమర శంఖం

కష్టపడి ఉన్నత చదువులు చదివారు. పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటి సచివాలయ ఉద్యోగులుగా సర్కారు కొలువులు సాధించారు. సెలవులు, వేళాపాలా లేకుండా సర్వేల పేరుతో కూటమి ప్రభుత్వం ఇంటింటికీ తిప్పుతూ తమ ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తోందన్న ఆవేదనతో పోరుబాట పట్టారు. ఐక్యవేదిక పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలు ధరించి వివిధ రీతుల్లో నిరసనలు తెలుపుతున్నారు.

- ఆత్మగౌరవం కోసం సచివాలయ ఉద్యోగుల పోరుబాట
- అక్టోబరు 5 వరకు వివిధ పద్ధతుల్లో నిరసనలు
- 29న అధికారిక వాట్సప్ గ్రూప్‌ల నుంచి వైదొలగడం
- అక్టోబరు 1న నల్లబ్యాడ్జీలు ధరించి పింఛన్ల పంపిణీ
- ఐక్యవేదిక యాక్షన్ ప్లాన్ మేరకు నిరసనల్లో పాల్గొంటున్న సచివాలయ ఉద్యోగులు



తణుకు మండలం కోనాలలో నల్లబ్యాడ్జీలతో సచివాలయ ఉద్యోగుల నిరసన

సాక్షి, భీమవరం : ప్రజల చెంతకే ప్రభుత్వ సేవల్ని చేరువచేస్తూ గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ తెచ్చింది. గ్రామాల్లో రెండు వేలు, పట్టణ ప్రాంతాల్లో నాలుగు వేల జనాభా చొప్పున జిల్లాలో 535 సచివాలయాలను ఏర్పాటు చేసింది. రాజకీయ జోక్యం, పైరవీలకు తావివ్వకుండా ఉద్యోగ నియామకాలు చేయడంతో పాటు సర్వీసు రూల్స్ వర్తింపచేసి అప్పట్లోనే రెగ్యులరైజ్ కూడా చేశారు. ఇంజినీరింగ్, వెల్ఫేర్, ఎడ్యుకేషన్, అగ్రికల్చర్, హార్టీకల్చర్, వెటర్నరీ, డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్ఎం, విలేజ్ సర్వేయర్ తదితర హోదాల్లో 4,331 మంది పనిచేస్తున్నారు.

పనిభారం పెంచేసిన కూటమి

గతంలో క్షేత్రస్థాయిలో అర్హులందరికి ప్రభుత్వ పథకాలు చేరేలా వలంటీర్లను సమన్వయం చేసుకుంటూ సచివాలయ ఉద్యోగులు పనిచేసేవారు. కూటమి ప్రభుత్వం జాబ్‌చార్ట్‌లో లేని పనులు చేయిస్తూ పనిభారం మొత్తం సచివాలయ ఉద్యోగులపై మోపింది. గతంలో నలుగురు వలంటీర్లు చేసే పని ఇప్పుడు ఒక సచివాలయ ఉద్యోగిపై పడింది. పండుగలు, సెలవురోజులు తేడా లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు సర్వేల పేరుతో ఇంటింటికీ తిప్పుతున్నారని ఉద్యోగులు మండిపడుతున్నారు.

ఆత్మగౌరవం కోసం..

ఇంటింటికీ తిప్పడం ద్వారా తమను పెద్ద వలంటీర్లుగా మార్చేశారని, క్షేత్రస్థాయిలో అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తోందని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. తమ ఆత్మగౌరవానికి భంగం వాటిల్లకుండా విద్యార్హతల ఆధారంగా విధులు నిర్వర్తించే అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్య వేదిక పేరిట సచివాలయ ఉద్యోగులు అంతా ఒకే గొడుగు కిందకు వచ్చి తమ సమస్యలను పరిష్కరించాలంటూ గళమెత్తుతున్నారు. ఈమేరకు ఈనెల 22వ తేదీ వరకు ప్రభుత్వానికి గడువిస్తూ 8వ తేదీన అధికారులకు నోటీసు అందజేశారు.

పోరుబాటలో ఉద్యోగులు

ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ఈనెల 23వ తేదీ నుంచి అక్టోబరు 5 వరకు తదుపరి కార్యాచరణను ఐక్యవేదిక విడుదల చేసింది. ఈమేరకు మూడు రోజులుగా ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతున్నారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో సచివాలయం ముందు ప్లకార్డులతో నిరసనలు తెలుపుతున్నారు.

ఉద్యోగుల డిమాండ్లు

- ఇంటింటా సర్వేలు, ఇతర పనుల నుంచి విముక్తి కల్పించాలి.
- నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలి.
- ఆరేళ్ల పాటు ఒకే కేడర్‌లో సర్వీస్ చేసిన వారికి ఏఏఎస్ ప్రకారం స్పెషల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలి.
- ఉద్యోగులకు ప్రస్తుతం అమలు అవుతున్న రికార్డు అసిస్టెంట్ కేడర్‌ను జూనియర్ అసిస్టెంట్ కేడర్‌కు మార్చాలి.
- అన్ని విభాగాల్లో ప్రమోషన్ ఛానల్స్ ఏర్పాటు చేసి జిల్లాల వారీగా సీనియారిటీ జాబితా విడుదల చేయాలి.
- స్టేషన్ సీనియారిటీ ఆధారంగా పారదర్శక బదిలీలకు ప్రత్యేక విధి విధానాలు తేవాలి.
- ఉద్యోగులను మాతృశాఖలకు అప్పగించాలి.
- సమయ పాలన లేని ఒత్తిడితో కూడిన విధుల నుంచి విముక్తి కల్పించాలి.
- కార్యాలయ పనివేళలు పాటించకుండా వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించడం, సెలవులు, పండుగలు, ఆదివారాల్లో బలవంతపు విధులు చేయించరాదు.

నేటి నుంచి తీవ్రతరం

ఆందోళనలో భాగంగా నేటి నుంచి ఉద్యమాన్ని మరింత విస్తరించనున్నారు. అందులో భాగంగా శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో మండల, మున్సిపల్ కార్యాలయాల ముందు ప్లకార్డులతో నిరసన తెలియజేయనున్నారు.

- 27న జాతీయ నాయకులు మహాత్మాగాంధీ, డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేయడం.
- 28న విశాఖపట్నం వేదికగా ప్రాంతీయ సభ, అలాగే సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవ శంఖారావం పేరిట 26 జిల్లాల్లో స్టీరింగ్ కమిటీల సమావేశాల నిర్వహణ.
- 29న పింఛన్ నగదు బ్యాంకుల నుంచి విత్‌డ్రా చేసిన అనంతరం అధికారిక వాట్సప్ గ్రూపుల నుంచి వైదొలగడం.
- 30న దుర్గాష్టమి సెలవుదినం. అక్టోబరు 1న నల్లబ్యాడ్జీలు ధరించి యథావిధిగా ఇంటింటికీ లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ.
- 2న గాంధీ జయంతి రోజు ప్రత్యక్ష కార్యక్రమాలకు విరామం. మహాత్మా మా ఘోష వినంటూ వాట్సప్ స్టేటస్ అప్‌లోడ్ చేయడం.
- 3న మండల, మున్సిపల్ స్టీరింగ్ కమిటీల సన్నాహక సమావేశం. 4న జిల్లా స్టీరింగ్ కమిటీ, 5న రాజమహేంద్రవరం వేదికగా ప్రాంతీయ సభలకు ఐక్య వేదిక పిలుపునిచ్చింది.

న్యూస్‌రీల్

పెరుగుతున్న గోదావరి వరద



పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద వరద

పోలవరం రూరల్: గోదావరి వరద ఉధృతంగా పెరుగుతోంది. నదీ పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు కొండ వాగుల నీరు నదిలోకి చేరడంతో క్రమేపీ పెరుగుతోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 30.740 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. స్పిల్‌వే 48 గేట్ల నుంచి దిగువకు 6.16 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు చేరుతోంది. దిగువన వరద ప్రవాహం పెరిగింది. ఎగువన భద్రాచలం వద్ద 37.10 అడుగులకు నీటిమట్టం చేరుకుంది.

బీసీలకు అన్యాయం చేస్తే పోరాటమే



సమావేశంలో మాట్లాడుతున్న తులసీగురి

భీమవరం: రాష్ట్రంలో బీసీ కులాలను అణగదొక్కాలని చూస్తున్నారని, బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై పోరాటాలు చేస్తామని నేషనల్ బీసీ సమాఖ్య సంక్షేమ సంఘం నేషనల్ ప్రెసిడెంట్ గుత్తుల తులసీగురి, ఏపీ స్టేట్ ప్రెసిడెంట్ ఎన్ గంగారామ్ అన్నారు. గురువారం భీమవరంలో నేషనల్ బీసీ సమాఖ్య సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీల్లో భాగంగా బీసీ కులాలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించి, బీసీలకు రక్షణ చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జాతీయ అధ్యక్షుడిగా గుత్తుల తులసీగురి, ఉపాధ్యక్షుడిగా మోపాటీ బలపరమేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి దొంగ కృష్ణ, జాయింట్ సెక్రటరీ ఎం.విజయ్ ఎన్నికకాగా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్ గంగారామ్, కండిబోయిన సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షునిగా కొమ్మోజు కన్నబాబు, జాయింట్ సెక్రటరీ గుబ్బల నాగేశ్వరరావు, ప్రచార కమిటీ చైర్మన్‌గా వాస రామ ఎన్నికయ్యారు.

నేవీ డిపోకు వ్యతిరేకంగా ఉద్యమం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ఏలూరు(ఆర్‌ఆర్‌పేట): నేవీ ఆయుధ డిపో పేరుతో చేస్తున్న భూసేకరణను వెంటనే నిలిపివేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం ఏలూరు పవరుపేటలో పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నేవీ ఆయుధ డిపోకు సంబంధించి భూసేకరణకు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, కలెక్టర్ వెట్రిసెల్వి, నేవీ అధికారులు చేసిన ప్రకటనను వ్యతిరేకిస్తున్నామన్నారు. గిరిజనులు ఆయుధ డిపోను వ్యతిరేకిస్తున్నా భూసేకరణకు ముందుకు సాగడం దారుణమన్నారు. సీపీఎం కేసులకు భయపడదని, ప్రజా సమస్యలపై పోరాడుతుందన్నారు. విలేకరుల సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సభ్యులు బీ. బలరాం, జిల్లా కార్యదర్శి ఏ. రవి, కార్యదర్శి సభ్యులు తెల్లం రామకృష్ణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, ఆర్. లింగరాజు, ఎం.నాగమణి, జీ.రాజు, కే.శ్రీనివాస్, పీ.రామకృష్ణ పాల్గొన్నారు.

27న జాబ్‌మేళా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నేషనల్ కెరీర్ సర్వీస్, సెట్‌వెల్ ఆధ్వర్యంలో ఈ నెల 27న ఉదయం 10 గంటలకు ఏలూరు కలెక్టరేట్ కాంపౌండ్‌లోని సెట్‌వెల్ కార్యాలయంలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వీ.వరలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో హ్యాపీ మొబైల్స్, వేరియంట్ ప్రైమరీ స్కూల్, ఎల్‌ఐసీ ఆఫ్ ఇండియా వంటి ప్రముఖ కంపెనీల్లో వివిధ ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

రెండో విడత ప్రవేశాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డిగ్రీ కళాశాలల్లో రెండో విడత ప్రవేశాలకు ఈనెల 29వ తేదీ వరకు గడువు ఉందని ఏలూరు జిల్లా నోడల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యుడు గుత్తా గిరిబాబు ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ కోర్సుల్లో చేరడానికి ఇంటర్ లేదా తత్సమాన పరీక్ష పాసైన విద్యార్థులు ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

కాత్యాయనీ.. విజయరూపిణీ



శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ద్వారకాతిరుమల క్షేత్ర దేవత కుంకుళ్లమ్మవారు గురువారం కాత్యాయనీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పదేళ్లకు ఒకసారి మాత్రమే దర్శనమిచ్చే కాత్యాయనీ అమ్మవారి అవతారాన్ని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.
– ద్వారకాతిరుమల

పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. జిల్లాలో పరిశ్రమలు, సేవా రంగాల విస్తరణ ద్వారా జీడీపీ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచేలా అధికారులు సమష్టిగా కృషి చేయాలన్నారు. గురువారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరం నందు జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక మండలి, ఇన్వెస్టర్లతో కలెక్టర్ ముఖాముఖి సమావేశం నిర్వహించారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, జిల్లా టూరిజం శాఖ అధికారి ఏవీ అప్పారావు, జిల్లా పంచాయతీ అధికారి ఎం.రామ్‌నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష : జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. గురువారం భీమవరం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరం నందు కలెక్టర్ నాగరాణి డ్వామా, డీఆర్‌డీఏ, డీపీఓ, ఫిషరీస్, జీఎస్‌డబ్ల్యూ ఎస్, సీపీఓ, కార్మిక శాఖల జిల్లా అధికారులు, జిల్లాలోని ఎంపీడీవోలతో సమావేశమై వివిధ అంశాలపై సమీక్షించారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

భీమవరం: భీమవరం వన్‌టౌన్‌లోని విస్సాకోడేరు వంతెన సమీపంలో లారీ ఢీకొని యువకుడు మృతి చెందాడు. పోలీసులకు అందిన ప్రాథమిక వివరాల ప్రకారం.. గురువారం విస్సాకోడేరుకు చెందిన మోహనసాయి (25) భీమవరం నుంచి ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. అదే సమయంలో పాలకొల్లు నుంచి భీమవరం వైపు వెళ్తున్న లారీ ఎదురుగా వచ్చి అతడిని ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదం జరిగినా లారీ డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. సీఐ ఎం.నాగరాజు, పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు.

ఇసుక అక్రమాలపై చర్యలేవి?

- శాసనమండలిలో ఎమ్మెల్సీ వంక గళం
- ఉలిక్కిపడి సర్దుకుంటున్న అక్రమార్కులు



అమ్మకాలతో తగ్గిన ఆచంటలోని ఇసుక గుట్టలు



కరుగోరుమిల్లులో తరలించేసిన ఇసుక

పెనుగొండ: ఇసుక అక్రమాలపై వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ గురువారం శాసనమండలిలో ధ్వజమెత్తారు. పశ్చిమగోదావరి జిల్లాలో దొంగరావిపాలెం నుంచి నరసాపురం వరకూ ఇసుక తవ్వకాలకు అనుమతులు లేకపోయినా ర్యాంపులు ఉన్న ప్రతి చోటా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని, వీటిపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. దీంతో ఇసుక అక్రమార్కులకు గొంతులో ఎలక్కాయ పడినట్లయింది. కూటమి నాయకులకు అక్రమ ఇసుక కాసులు కురుస్తుండడంతో జిల్లాలో ఇసుక దందా జోరుగా సాగుతోంది. ఇటీవల ఆచంట, కరుగోరుమిల్లి, కొడమంచిలి గ్రామాల్లో భారీగా నిలువలు చేసి అమ్మకాలు సాగించారు. దొంగరావిపాలెంలోనూ నిలువచేసిన ఇసుకను ప్రభుత్వ సొత్తుగా చూపేందుకు అనుమతుల కోసం దరఖాస్తు చేశారు. ఇప్పటివరకూ అనుమతి లభించకపోయినా అమ్మకాలు మాత్రం యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇష్టానుసారంగా ధరలు వసూలు చేసి అమ్మకాలు చేశారు. ఈ తరుణంలో ఇసుక అక్రమాలపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్సీలు వంక రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్‌లకు విజ్ఞప్తి చేశారు. దీంతో అక్రమ నిల్వలు చేసిన వారు ఉలిక్కిపడి హడావుడిగా ఇసుకను తరలిస్తున్నారు.

కైకలూరు.. పొట్టేళ్ల పందేల జోరు

- కొల్లేరు చెరువు గట్లు కేంద్రంగా నిత్యం నిర్వహణ
- ఒక్కొక్క పందెం రూ.లక్ష నుంచి ప్రారంభం
- ఉమ్మడి పశ్చిమలో కొత్త ట్రెండ్‌కు శ్రీకారం
- పందేల మాటున భారీగా వసూళ్లకు పాల్పడుతున్న కూటమి నేతలు
- కోడిపందేల కంటే ముందుగానే పొట్టేళ్ల పందేలతో హడావుడి
- కృష్ణా, పశ్చిమగోదావరి నుంచి నిత్యం పందేలరాయుళ్లు కైకలూరుకు రాక



కైకలూరు చెరువు గట్లపై నిర్వహిస్తున్న పొట్టేళ్ల పందేలు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉమ్మడి పశ్చిమ గోదావరిలో కొత్త ట్రెండ్ ప్రారంభమైంది. కోడిపందేలకు రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే పశ్చిమగోదావరి జిల్లా ఖ్యాతిగాంచింది. గత రెండు, మూడేళ్ల నుంచి జిల్లాలో ఒక ప్రాంతంలో పందులతో పందేలు నిర్వహించిన పందేలరాయుళ్లు తెలంగాణలో నిషేధించిన పొట్టేళ్ల పందాలకు జిల్లాను అడ్డాగా మారుస్తున్నారు. ప్రధానంగా కైకలూరు నియోజకవర్గంలోని కొల్లేరు చెరువు గట్లను పందెం అడ్డాలుగా మారుస్తూ లక్షల్లో పందేలు నిర్వహిస్తూ అధికార పార్టీ నేతలు కాసులు దండుకుంటూ అనేక మంది జేబులు గుల్ల చేస్తున్నారు. జిల్లాలో సంక్రాంతి సమయంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా కోడిపందేలు నిర్వహిస్తుంటారు. హైకోర్టు నిషేధాజ్ఞలు ఉన్నా పోలీసులు హడావిడి చేసినా ఏమీ లెక్కచేయకుండా అధికార పార్టీ ముసుగులో భారీగా కోడిపందేలు నిర్వహిస్తుంటారు. జూన్ నుంచే పందెం కోళ్లకు ప్రత్యేకంగా శిక్షణ శిబిరాలను నిర్వహించి పందెం కోళ్లను సన్నద్ధం చేస్తుంటారు. ముఖ్యంగా ఏలూరు జిల్లాలో కైకలూరు ప్రాంతంలోని కొల్లేరులో ఉన్న చేపల చెరువు గట్ల వద్ద భారీ జీతాలతో ట్రైనర్లను నియమించి ప్రత్యేక బ్రీడ్ పందెం పుంజులను ఎంపిక చేసి శిక్షణ ఇస్తుంటారు. అలాంటి శిక్షణా కేంద్రాలే బెట్టింగ్ అడ్డాలుగా మారుతున్నాయి. పేకాట శిబిరం, కోడి పందేల బదులు పొట్టేళ్ల పందేలకు తెరతీయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. నిర్మానుష్య ప్రాంతాల్లో ఆక్వా చెరువులు ఉండటంతో పోలీసుల హడావిడి ఉండదంటూ ఇతర ప్రాంతాల నుంచి జూదరులను ఆహ్వానిస్తున్నారు. తాజాగా చెరువు గట్లపై పొట్టేళ్ల పందేలను సైతం నిర్వహిస్తూ బరితెగింపునకు తెరలేపుతున్నారు. ఒక్కొక్క పందెం కనీసం రూ.లక్ష నుంచి పొట్టేలు స్థాయిని బట్టి రూ.3 లక్షల వరకు కూడా కాస్తున్నారు.

జిల్లాలో సంక్రాంతి వంటి పెద్ద పండుగలకే పరిమితమైన కోడిపందేలు, పేకాట, పొట్టేళ్ల పందేలు కూటమి నేతలకు ఇప్పుడు నిత్య ఆదాయ వనరుగా మారిపోయాయి. చేపల చెరువు గట్లపై గుట్టు చప్పుడు కాకుండా పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారు. కైకలూరులో రోజంతా ప్రజాప్రతినిధి వెంట తిరుగుతూ రాత్రి సమయంలో టిప్పర్ల మైనింగ్ అవతారం ఎత్తే నేత తాజాగా పొట్టేళ్ల పందేలకు శ్రీకారం చుట్టాడు. పోలీసు శాఖపై కూడా ఇతనికే పెత్తనం చేసే పని అప్పగించడంతో ఇతని వైపు పోలీసులు కన్నెత్తి చూడటం లేదు. ఇతని చెరువు గట్టుపై వేసే ఒక్కో పందెం రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు పలుకుతుంది. శని, ఆదివారాల్లో పొట్టేళ్ల పందేలు జరుగుతున్నట్టు సమాచారం. రెండు పొట్టేళ్లు కొమ్ములతో కొట్టుకుంటూ ఏది పారిపోతే అది ఓడిపోయినట్టు లెక్క. కోడిపందేలకు అలవాటు పడిన వ్యసనపరులు తెలియని పొట్టేళ్ల పందేలలో రూ.లక్షలు తగలేసుకుని ఇంటి ముఖం పడుతున్నారు.

కొల్లేరు అడ్డాగా పందేలు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 9 మండలాల్లోని 122 గ్రామాల్లో కొల్లేరు సరస్సు విస్తరించి ఉంది. సరస్సు సమీపంలో లక్షలాది ఎకరాల్లో చేపల చెరువుల సాగు చేస్తున్నారు. ఇవే పేకాట జూదరులకు అవకాశంగా మారుతున్నాయి. చెరువుల్లో వేసే మేతల నిల్వ కోసం, కాపలాదారుల కోసం గృహాలు నిర్మిస్తారు. కొందరు చెరువు వద్ద విశ్రాంతి భవనాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రధానంగా పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు, భీమవరం నుంచి ఏలూరు జిల్లా సరిహద్దు కైకలూరు మండలంలో ఉప్పుటేరు సమీపంలోని చేపల చెరువులపై పేకాట శిబిరాలు జరుగుతున్నాయి. పోలీసులు డ్రోన్లు ఎగురవేసి మమ అనిపిస్తున్నారు. పొట్టేళ్ల పందేల నిర్వహణపై కైకలూరు సీఐ కృష్ణను వివరణ కోరగా.. పొట్టేళ్ల పందేలపై నిఘా ఉంచి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తెలంగాణలో కేసులు

బెట్టింగులతో పొట్టేళ్ల పందేలు నిర్వహిస్తే తెలంగాణలో కేసులు నమోదు చేస్తారు. దీంతో ఈ ఏడాది సంక్రాంతికి కైకలూరు నియోజకవర్గం చావలిపాడులో కోడిపందేలతో పాటు పొట్టేళ్ల పందేలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి 150 పొట్టేళ్లను తీసుకొచ్చారు. గొప్ప కోసం ఓ కూటమి నేత మహిళలతో కూడిన 30 మంది బౌన్సర్లను తీసుకొచ్చి ఆకర్షించాడు. దీంతో పొట్టేళ్ల పందేలకు వచ్చిన క్రేజ్‌ను కూటమి నేతలు ఉపయోగించుకుంటున్నారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో సంక్రాంతికి పొట్టేళ్ల పందేలు నిర్వహిస్తారు. ఆ తర్వాత ఏడాది వరకు వాటి జోలికి వెళ్లరు. తాజాగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో పొట్టేళ్ల సంస్కృతిని తీసుకొస్తున్నారు.

ఏజెన్సీలో భూసేకరణ నిలుపుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల్లో భూసేకరణ నిలుపుదల చేయాలని, నేవీ ఆయుధ కర్మాగార నిర్మాణం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డిమాండ్ చేసింది. గురువారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుంజా కృష్ణంరాజు అధ్యక్షతన ఆదివాసీ ముఖ్య నాయకుల సమావేశం బుట్టాయగూడెంలో జరిగింది. ఏపీ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ వైస్ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటికే సేకరించి వివాదాల్లో ఉన్న వేల ఎకరాల భూమిని పోలవరం నిర్వాసితులకు కేటాయించడం వల్ల భూవివాదాలతో స్థానిక ఆదివాసీ నిర్వాసితులు, ఆదివాసీలు నిరంతరం గొడవలు పడుతూ అశాంతితో జీవిస్తున్నారని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఏడు మండలాల పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను తీసుకువచ్చి వారికి బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో పునరావాసం కల్పించడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. పెద్ద మొత్తంలో ప్రభుత్వం సొమ్మును దోచుకోవడానికి ఎల్‌టీఆర్ భూములను సేకరించడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, దళారులు పడుతున్న తాపత్రయం, హడావిడి చూస్తుంటే భారీ కుంభకోణం జరుగుతుందని అర్థమవుతుందని చెప్పారు. ఏటీపీ నాయకులు తెల్లం రాములు, తెల్లం గంగరాజు, కోర్సా నాగేశ్వరరావు, కుంజా రమేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫుడ్ పాయిజన్‌తో ఇద్దరు పిల్లలకు అస్వస్థత



చిన్నారులను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తున్న దృశ్యం

కామవరపుకోట: ఫుడ్ పాయిజన్ వల్ల ఇద్దరు పిల్లలు అస్వస్థతకు గురైన సంఘటన గురువారం కొత్తూరు యానాదుల కాలనీలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం యానాదుల కాలనీకు చెందిన పొట్లూరి రమేష్, రమణ దంపతుల కుమారుడు మనోజ్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతుండగా, కుమార్తె రేణుకమ్మ సమీప అంగన్‌వాడి కేంద్రానికి వెళుతుంది. ఈ క్రమంలో మనోజ్‌కి సెలవులు కావడంతో గురువారం అన్నాచెల్లెలు ఇద్దరు ఇంటిదగ్గర భోజనం చేసి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లారు. అక్కడ కొంతసేపటికి ఇద్దరికీ వాంతులు కావడంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి తీసుకువెళ్లగా అక్కడ వైద్యులు ఇద్దరు పిల్లలకు ఫుడ్ పాయిజన్ అయ్యిందని నిర్ధారించి చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం 108లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రతి వ్యక్తికీ జీవిత బీమా తప్పనిసరి



జన సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌బీఐ ఆర్‌డీ బషీర్

పోలవరం రూరల్: బ్యాంకు ఖాతా కలిగిన ప్రతి వ్యక్తి బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌బీఐ రీజినల్ డైరెక్టర్ బషీర్ తెలిపారు. పోలవరం మండలంలోని పాత పట్టిసీమ గ్రామంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గ్రామ స్థాయి జన సురక్ష కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బషీర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంక్ ఖాతాలను సమయానికి రీ-కేవైసీ చేయించుకోవాలని, తద్వారా లావాదేవీల్లో ఎటువంటి అంతరాయం లేకుండా సులభంగా సేవలు పొందవచ్చని సూచించారు. బ్యాంకుల్లో అందుబాటులో ఉండే వివిధ బీమా పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్‌డీవో నవీన్, కెనరా బ్యాంక్ డీజీఎం మాధవరావు, ఎస్‌బీఐ డీజీఎం పంకజ్ కుమార్, ఆర్‌ఎం రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు హేమంత్‌శ్రీ ఎంపిక



హేమంత్‌శ్రీని అభినందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: చైనాలో నిర్వహించనున్న జూనియర్ ఏషియన్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలకు తణుకు శ్రీచిట్టూరి సుబ్బారావు గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారుడు సమ్మెట్ల హేమంత్‌శ్రీ ఎంపికైనట్లు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షురాలు చిట్టూరి సత్య ఉషారాణి తెలిపారు. ఈ నెల 13 నుంచి 21 వరకు హర్యానాలో పంచకుల నగరంలో నిర్వహించిన ఆల్ ఇండియా జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతగా నిలిచి చాంపియన్‌షిప్‌లో పోటీల్లో పాల్గొనే జట్టులో చోటు సంపాదించినట్లు వివరించారు. అక్టోబర్ 21 నుంచి 26 వరకు చైనాలో జరిగే అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు హేమంత్‌శ్రీ వెళ్లనున్నట్లు అసోసియేషన్ సెక్రటరీ మెంటే వంశీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా హేమంత్‌శ్రీని కళాశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు, చిట్టూరి రీనాసాయి, కోచ్‌లు సమ్మెట్ల సతీష్ బాబు యు.సుదర్శన్, ఫిజికల్ డైరెక్టర్ ఎం.రత్నకుమారి అభినందించారు.

మావుళ్లమ్మ భక్తులకు అన్నదాన కష్టాలు

- కూర్చొని తినే సౌకర్యం లేక ఇబ్బందులు
- ఏళ్ల తరబడి ఇరుకు గదిలోనే అన్నదానం



రోడ్డుపై క్యూలైన్‌లో టోకెన్ల కోసం భక్తుల అవస్థలు



ఇరుకు గదిలో భోజనం చేస్తున్న భక్తులు

భీమవరం(ప్రకాశం చౌక్): రాష్ట్రంలోనే ప్రముఖ దేవస్థానం శ్రీమావుళ్లమ్మ వారి దేవస్థానంలో భక్తులను అన్నదాన కష్టాలు వెంటాడుతున్నాయి. కనీసం ముప్పై మంది కూడా పట్టని గదిలో అన్నప్రసాదాన్ని అందించడంతో భక్తులు నిలబడి ఒకరిపై ఒకరూ పడుతూ అన్నప్రసాదం తినాల్సి వస్తుందని వాపోతున్నారు. అమ్మవారి ప్రసాదంగా భావించి భోజనం చేయాలంటే బయట రోడ్డుపై క్యూలైన్‌లో నుంచి చిన పాటి సందులోకి వెళ్లి ఇరుకు గదిలో భోజనం చేసి రావాలి. దీంతో మహిళలు, చిన్న పిల్లలతో వచ్చేవారు, వృద్ధులు చాలా చాలా ఇబ్బందులు పడుతున్నారు. అమ్మవారి వార్షికోత్సవాలు, దసరా ఉత్సవాల వంటి సమయంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చినా కొందరికే అమ్మవారి భోజనం దక్కుతుంది.

రెండు సెంట్లల్లోనే ఆఫీసు, భోజనశాల

మావుళ్లమ్మ దేవస్థానంలో రెండు సెంట్లల్లో నిర్మించిన భవనంలో పైన దేవస్థానం ఆఫీసు, కింద గదిలో భోజనశాల ఉంది. ఈ భవనం ఇరుగ్గా ఉండడం వల్ల అటు ఆఫీసుకు ఇటు భోజనశాలకు కూడా సరిపోక దేవస్థానం సిబ్బంది, భక్తులు ఇబ్బందులుపడుతున్నారు. లోపల భవనంలో కనీసం నిలబడడానికి కూడా వీలు లేకపోవడంతో రోడ్డుపై భక్తులు క్యూలో నిల్చుంటున్నారు. భక్తుల వల్ల ఈ రోడ్డులో ట్రాఫిక్ సమస్య కూడా పెరుగుతుందని స్థానికులు చెబుతున్నారు.

టోకెన్ లెక్కల ప్రకారమే భోజనం

మావుళ్లమ్మ దర్శనం కోసం హైదరాబాద్, విశాఖ, విజయవాడ, గుంటూరు, రాజమండ్రి వంటి దూర ప్రాంతాలతో పాటు ఉభయగోదావరి జిల్లాల నలుమూల నుంచి కూడా భక్తులు వస్తూ ఉంటారు. అయితే ఎంత మంది వస్తే అంత మందికి భోజనం పెట్టకుండా టోకెన్ల ప్రకారమే ఇక్కడ భక్తులకు భోజనం పెడుతున్నారు. సాధారణ రోజుల్లో 170 నుంచి 200 మందికి, ఉత్సవాల సమయంలో 250 నుంచి 300 మందికి మాత్రమే భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. ఆ భోజనం కూడా ఇరుకు గదిలో పెట్టడం వల్ల అవస్థలు పడుతూ తినాల్సి వస్తుందని భక్తులు వాపోతున్నారు. అమ్మవారికి భక్తులు సమర్పించే కానుకలు, శాశ్వత నిత్యాన్నదానం కోసం వచ్చే విరాళాలతో మంచి ఆదాయం వస్తున్నప్పటికీ అమ్మవారి భోజన ప్రసాదం కొందరి భక్తులకే దొరుకుతుంది. ఆలయం వద్ద ఇన్ని ఇబ్బందులు ఉన్నా దేవదాయ ఉన్నతాధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.



మావుళ్లమ్మ వారి దేవస్థానం వెనుక మున్సిపల్ షాపులు

భోజనానికి ఏటా అవస్థలే



మేము ప్రతి ఏడాది దసరా, వార్షికోత్సవాల్లో మావుళ్లమ్మను దర్శించుకోవడానికి వస్తాం. ప్రతిసారీ కూడా అమ్మవారి భోజన ప్రసాదం కోసం అవస్థలు పడుతున్నాం. చిన్న గదిలో భోజన ప్రసాదం పెట్టడం వల్ల ప్రసాదం ప్రశాంతంగా సంతృప్తిగా తినలేక పోతున్నాం. భోజనశాల విషయంలో అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కె.భాస్కరలక్ష్మి, హైదరాబాద్

చిన్న పిల్లలతో చాలా ఇబ్బందులు



దసరా మహోత్సవాల్లో మావుళ్లమ్మ వారిని దర్శించుకోవడానికి ప్రతి ఏడాదీ వస్తాం. అయితే అమ్మవారి భోజన ప్రసాదం సెంటిమెంట్‌గా భావించి ఇరుకు గదైనా ఇబ్బందిగా ఉన్నా భోజనం చేస్తున్నాం. అయితే పిల్లలతో వచ్చేవారు భోజన గదికి వెళ్లే సందులో, లోపల భోజనం చేయడానికి ఖాళీ సరిపోక చాలా ఇబ్బందులు పడుతున్నారు.

– కె.భాగ్యలక్ష్మి, హనుమాన్ జంక్షన్

మున్సిపల్ షాపులు తొలగిస్తే

శ్రీ మావుళ్లమ్మ వారి దేవస్థానం వెనుక వైపు సుమారు 3 సెంట్లల్లో ఉన్న మున్సిపల్ స్థలంలో అద్దె ప్రాతిపదికన పలు షాపులు ఉన్నాయి. వాటిని తొలగించి ఆ స్థలం అమ్మవారికి దేవస్థానానికి నిబంధనలు మేరకు అప్పగిస్తే అన్నదాన కష్టాలు తీరుతాయని భక్తులు చెబుతున్నారు. మావుళ్లమ్మ ఆలయం కారణంగానే మున్సిపాలిటీకి షాపుల ద్వారా ఏటా రూ.5.90 లక్షల ఆదాయం సమకూరుతుంది. భక్తుల ఇబ్బందుల దృష్ట్యా మున్సిపల్ అధికారులు, దేవదాయ శాఖ ఉన్నతాధికారులు సమన్వయంతో నిర్ణయం తీసుకుంటే సమస్య పరిష్కారమవుతుందని పట్టణవాసులు చెబుతున్నారు.

ఫార్మాసిస్టులు నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు

తణుకు అర్బన్: మందుల విక్రయాల్లో ఫార్మాసిస్టులు పూర్తిస్థాయిలో నిబంధనలు పాటించాలని డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ పి.మల్లికార్జునరావు అన్నారు. ప్రపంచ ఫార్మాసిస్ట్ డే సందర్భంగా తణుకు డ్రగ్గిస్ట్ కెమిస్ట్ అసోసియేషన్ హాలులో గురువారం నిర్వహించిన ఫార్మాసిస్టుల అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మత్తు మందులు వినియోగించే వారిని గుర్తించి వారికి ఆ మందుల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపట్ల అవగాహన కల్పించాలని సూచించారు. ఫార్మాసిస్టులు వైద్యులు సూచనల మేరకు మాత్రమే మందులు విక్రయిచాలని సూచించారు. అనంతరం రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకులో 15 మంది అసోసియేషన్ సభ్యులు రక్తదానం చేశారు. సీనియర్ ఫార్మాసిస్టులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి రామ్‌చందర్, ఫార్మాసిస్టుల సంక్షేమ రాష్ట్ర ఉప కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోర్టుకు చేరుతున్న వయసు పంచాయితీలు

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్లుగా పనిచేసే వారి ఉద్యోగ విరమణ వయస్సు 62 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాలకు పెంచాలనే పంచాయితీలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఆగస్టు 31వరకు పని చేసిన, కె.గోపాల్ తన వయస్సు 65 ఏళ్లు వచ్చే వరకు వీసీ పదవిలో ఉంచాలని హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఉద్యాన వర్సిటీ వీసీ వ్యవహారం 25 రోజులుగా ఇంకా తేలలేదు. తాజాగా ఇటీవల వెంకట్రామన్నగూడెం ఉద్యాన విశ్వవిద్యాలయంలో డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్‌గా పని చేసి 62 ఏళ్లు ముగియడంతో ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ నారం నాయుడు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రమాదేవి, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పని చేసి తాజాగా ఉద్యోగ విరమణ చేసిన ఓబయ్య అనే వ్యక్తి కూడా ఉద్యోగ విరమణ వయస్సును 62 నుంచి 65 సంవత్సరాలకు పెంచాలని హైకోర్టులో రిట్ పిటిషన్లు వేసినట్లు సమాచారం.

7 నుంచి భారత్ గౌరవ్ యాత్ర

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఆర్‌సీటీసీ) ఆధ్వర్యంలో అక్టోబర్ 7 నుంచి భారత్ గౌరవ్ యాత్ర ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు ఐఆర్‌సీటీసీ విజయవాడ యూనియన్ మేనేజర్ ఎం. రాజా తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఏలూరులో ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ యాత్ర సికింద్రాబాద్ నుండి ప్రారంభమై ద్వారకా, సోమనాథ్, అహ్మదాబాద్, మోథేరా, పటాన్, స్టాట్యూఆఫ్ యూనిటీ వరకు సాగుతుందని పేర్కొన్నారు. ఈ యాత్రలో ద్వారకాదీష్ టెంపుల్, నాగేశ్వర్ టెంపుల్, ద్వారకా, సోమనాథ్ ఆలయం, శబర్మతి ఆశ్రం, మోథేరాజ్ సూర్యదేవాలయం, రాణి కి వాప్ (పటాన్), సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం (ఏక్తానగర్‌లను సందర్శించవచ్చని వివరించారు. ఈ యాత్రకు స్లీపర్‌క్లాస్‌లో పెద్దలకు రూ.18,400లు, 11 సంవత్సరాలోపు పిల్లలకు రూ.17,300లు, థర్డ్‌క్లాస్ ఏసీలో పెద్దలకు రూ.30,200, పిల్లలకు రూ. 28,900లు, సెకండ్‌క్లాస్ ఏసీలో పెద్దలకు రూ.39,900, పిల్లలకు రూ. 38,300గా టిక్కెట్ రేటు నిర్ణయించినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9281495848, 9281030714 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

కారు ఢీకొని బాలుడి మృతి

తాడేపల్లిగూడెం రూరల్: మోటారు సైక్లిస్టును వెనుక నుంచి కారు ఢీకొన్న ప్రమాదంలో ఒక బాలుడు మృతి చెందినట్లు రూరల్ హెడ్‌కానిస్టేబుల్ ఎండీ జిలానీ తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొండ్రుప్రోలు కేఎస్ఎన్ కాలనీకి చెందిన రెడ్డి నాగబాబు(16) సుజుకీ యాక్సెస్ మోపెడ్‌పై తణుకు నుంచి ఏలూరు వైపుగా వస్తుండగా కొండ్రుప్రోలు జాతీయ రహదారిపై వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టడంతో మృతి చెందాడు. బుధవారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటనపై మృతుని తల్లి రెడ్డి మోహన లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ జిలానీ తెలిపారు.

అదును చూసి దోచేస్తున్నారు!

- రైతులతో ధాన్యం దళారుల ఆటలు
- ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో ఇష్టారీతిగా కొనుగోళ్లు



లింగారాయుడిగూడెంలో కోసిన ధాన్యాన్ని ట్రాక్టర్‌లోకి దిగుమతి చేస్తున్న దృశ్యం



కోసిన ధాన్యాన్ని లారీల్లోకి ఎక్కిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: వరుస తుఫాన్లు, వాయుగుండాలతో ఒక పక్క రైతు హడలిపోతుంటే మరో పక్క ధాన్యం కమీషన్‌దారులు మాత్రం పండుగ చేసుకుంటున్నారు. వర్షాల ప్రభావంతో పండించిన ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో తాడేపల్లిగూడెం మండలంలోని రైతులు నిమగ్నమయ్యారు. అయితే ఈ వర్షాలను సాకుగా చేసుకుని రైతు నుంచి అయినకాడికి ధాన్యాన్ని దళారులు కొనుగోలు చేస్తున్నారు. ఒక్క తాడేపల్లిగూడెం మండలంలోనే ఈ ఖరీఫ్ సీజన్‌లో 24,300 ఎకరాల్లో వరి సాగు చేశారు. పీఆర్-126 ఏడు వేల నుంచి ఎనిమిది వేల ఎకరాలు కాగా, స్వర్ణ రకం 10 వేల ఎకరాలు, సంపత్ స్వర్ణ 7 వేల ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుతం పీఆర్-126 రకం వరి చేలు చేతికి రావడంతో రైతులు కోతలు ప్రారంభించారు.

నాలుగు వేల ఎకరాల్లో కోతలు పూర్తి

ఇప్పటికే మండలంలోని నాలుగు వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ధాన్యాన్ని గట్టెక్కించేందుకు రైతులు వివిధ ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే గత నాలుగు రోజుల క్రితం వరకు 75 కిలోల బస్తా ధాన్యం రూ.1190కు కొనుగోలు చేయగా, నేడు రూ.1160కు కమీషన్‌దారులు కొనుగోలు చేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. నాలుగు రోజుల వ్యవధిలో బస్తాకు రూ.30 తగ్గించారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ పరిస్థితులను బట్టి రైతుల నుంచి కమీషన్‌దారులు ఒక్కో రోజు ఒక్కో ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని చెబుతున్నారు. ఇదిలా ఉంటే మెట్ట గ్రామాల్లో వరి కోతలు దాదాపు పూర్తి కావస్తున్నా నేటికీ ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు కనుచూపు మేరలో కానరావడం లేదు. ఇదే అదనుగా కమీషన్‌దారులు ముందస్తుగానే అయిన కాడికి ధాన్యాన్ని కొనుగోలు చేసి, సొమ్ము చేసుకుంటున్నారు.

అప్పటికప్పుడు మెషీన్లతో కోత



ధాన్యం 75 కిలోల బస్తా వెయ్యి రూపాయలకు కొనుగోలు చేసేది లేదంటూ కమీషన్‌దారులు భీష్మించుకుని కూర్చున్నారు. ఎట్టకేలకు రూ.1160లకు కొనుగోలు చేసేందుకు ముందుకొచ్చారు. దీంతో అప్పటికప్పుడు మెషీన్లను పెట్టి వరి కోతలు చేపట్టాం. ఏ క్షణాన వాతావరణం ఎలా ఉంటుందోనని ఆందోళన వెంటాడుతుంది.

– మైనం సత్యనారాయణ, లింగారాయుడిగూడెం

పరిమితి మేరకు వర్జీనియా సాగు చేయాలి



వేలం ప్రక్రియను పరిశీలిస్తున్న పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.విశ్వశ్రీ

జంగారెడ్డిగూడెం: వర్జీనియా సాగు బోర్డు సూచించిన పరిమితి మేరకు పండిస్తూనే ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు ఆలోచన చేయాలని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.విశ్వశ్రీ అన్నారు. జంగారెడ్డిగూడెంలోని వర్జీనియా వేలం కేంద్రాలను ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పొగాకు పైరుకు ప్రత్యామ్నాయ పంట వైపు రైతు దృష్టి సారించాలన్నారు. 365 రోజుల పచ్చదనం, పంట మార్పిడి, సేద్యంలో మెళకువలపై నిరంతరం అవగాహన కలిగి ఉండాలన్నారు. పొగాకు రైతులు వర్జీనియా పొగాకు మాత్రమే కాకుండా ఇతర వాణిజ్య పంటలను సాగు చేయాలన్నారు. మేలు రకమైన పంటను పండిస్తే మంచి ధర వస్తుందన్నారు. 2025-26 పంట కాలానికి వర్జీనియా పొగాకు బోర్డు 142 మిలియన్ కేజీల పొగాకును అనుమతించిందన్నారు. కాబట్టి రైతులు పరిమితిలోపు పంటను సాగు చేస్తూ మేలు రకమైన పొగాకును ఉత్పత్తి చేయాలని సూచించారు. అనంతరం రైతులు పలు సమస్యలను ఈడీ విశ్వశ్రీ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా పొగాకు బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను ఆమె పరిశీలించి, శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. కాగా పొగాకు వేలం కేంద్రానికి సంబంధించి ఉద్యోగుల భర్తీ ప్రక్రియను త్వరలోనే నిర్వహిస్తామని విశ్వశ్రీ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఎం జీఎల్‌కే ప్రసాద్, ఆక్షన్ మేనేజర్ కేవీ రామాంజనేయులు, ఏఎస్‌లు శ్రీహరి, సురేంద్ర, రైతు నాయకులు పరిమి రాంబాబు, కరాటం రెడ్డి బాబు, ఘంటసాల గాంధీ, అల్లూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో ఆరోగ్య సమాజం



చెత్తను శుభ్రం చేస్తున్న అనిల్‌కుమార్ రెడ్డి, కలెక్టర్ వెట్రిసెల్వి, ఇతర అధికారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రతిఒక్కరూ రోజూ కనీసం కొంత సమయం పాటు శ్రమదానం చేస్తే ఆరోగ్యవంతమైన పట్టణాలు, గ్రామాలుగా కళకళలాడతాయని ఏపీ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీ బి.అనిల్‌కుమార్‌రెడ్డి సూచించారు. స్థానిక పంపుల హెడ్ వాటరు వర్క్స్ వద్ద గురువారం స్వచ్ఛతా హీ సేవ - 2025లో భాగంగా ఏక్ దిన్, ఏక్ ఘంటా, ఏక్ సాథ్ అనే థీమ్‌తో కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి ఆయన ప్రత్యేక శుభ్రతా డ్రైవ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మంచిసేవలు అందించిన క్లాప్ మిత్రలకు అక్టోబరు 02న రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొనే విజయవాడలో సభలో బహుమతులు అందించి సన్మానిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భాను ప్రతాప్, జెడ్పీ సీఈఓ ఎం.శ్రీహరి, డిప్యూటీ కమిషనర్ బీ. శివారెడ్డి పాల్గొన్నారు.

భర్త వేధింపులతో భార్య ఆత్మహత్య?



తోట ఝాన్సీ (ఫైల్)

పాలకొల్లు సెంట్రల్ : మండలంలోని పూలపల్లి గ్రామానికి చెందిన తోట ఝాన్సీ (33) తన భర్త వేధింపులు భరించలేక బుధవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి తండ్రి ముదరకొల ప్రభుదాసు పోలీసులను ఆశ్రయించాడు. వివరాల ప్రకారం భీమవరం మండలం వెంప గ్రామ శివారు కొత్తపేటకు చెందిన ఝాన్సీకి 13 ఏళ్ల క్రితం దుర్గా పెద్దిరాజుతో వివాహమైంది. వివాహం తరువాత వీరిద్దరు పూలపల్లి నివాసం ఉంటున్నారు. రెండు సంవత్సరాలు ఇద్దరు బాగానే ఉన్నా పెద్దిరాజు మద్యానికి బానిసై భార్యను అనుమానిస్తూ తిడుతూ, కొడుతూ మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేసేవాడు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి పెద్దిరాజు మద్యం తాగి వచ్చి భార్యతో గొడవపడడంతో ఝాన్సీ తన తమ్ముడికి పిల్లలని బాగా చూసుకోమని, తన భర్త వేధింపులు భరించలేనని మెసేజ్ పెట్టింది. మెసేజ్ చూసుకుని పూలపల్లి వచ్చేసరికి ఝాన్సీ బెడ్ రూమ్‌లో ఫ్యాన్‌కి చీర కట్టి ఉరేసుకుంది. మృతురాలి తండ్రి ప్రభుదాసు పిర్యాదు మేరకు తోట దుర్గా పెద్దిరాజు, అతని తల్లిదండ్రులు వీరభద్రరావు, సత్యవతిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

పశువుల దొంగల ముఠా అరెస్ట్

భీమడోలు: పశువులను దొంగిలించి అక్రమంగా తరలిస్తున్న నలుగురు నిందితుల ముఠాను పాలసానిపల్లి ఫ్లైఓవర్ వద్ద బుధవారం రాత్రి భీమడోలు పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై వై.సుధాకర్ నేతృత్వంలో రాత్రి వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఆ నలుగురు పోలీసుల చేతికి చిక్కారు. వివరాల ప్రకారం పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన దుగ్గెంపూడి అశోక్‌రెడ్డితో పాటు హర్యానా రాష్ట్రంలోని మేవాడ్ జిల్లా జమాల్గర్‌కు చెందిన సయాంఖాన్, సలీం అహ్మద్, ఇమ్రాన్‌లు గత కొంత కాలంగా పశువులను చోరీ చేసి వాటిని చిలుకలూరిపేటలోని ఓ దొడ్డిలో ఉంచి విక్రయిస్తున్నారు. వీరు గత మూడేళ్లుగా ఏపీలోని పశువుల దొంగతనాలు చేస్తున్నారు. అయితే వాహన తనిఖీలు చేస్తుండగా పోలీసులను చూసి ఆ నలుగురు తమ మహీంద్రా బొలెరో వ్యాన్‌లో పారిపోతుండగా వారిని పట్టుకుని అరెస్ట్ చేశారు. అనంతరం వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు పశువులను దొంగిలిస్తున్నట్లు మధ్యవర్తులు వీఆర్‌వో లంక సాల్మన్‌రాజు, వీఆర్‌ఏ మద్దాల కృష్ణల సమక్షంలో బహిరంగంగా వాంగ్మూలాన్ని అందించారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

పెనుమంట్ర: మండలంలోని భట్లమగుటూరులో గొంతేరు డ్రెయిన్ మలుపు వద్ద గురువారం మోటారు సైకిలిస్టు ఆటోను ఢీకొట్టిన ఘటనలో మోటర్ సైకిల్‌పై ఉన్న గుంటూరి హేమసందీప్ (14)అనే బాలుడు తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పెనుమంట్ర ఎస్సై ఎ.స్వామి తెలిపారు. ఆలమూరు గ్రామానికి చెందిన హేమసందీప్, వరిగేటి ప్రదీప్‌లు మోటారు సైకిల్‌పై పాలకొల్లు నుంచి చిలకంపాడు వెళ్తూ ఆటోను ఢీకొట్టారు. దీంతో ఆటో యాంగిలర్ సందీప్ కడుపులోకి దిగింది. కొనఊపిరితో ఉన్న సందీప్‌ను, తీవ్ర గాయాలైన వరిగేటి ప్రదీప్‌ను 108 వాహనంలో తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సందీప్ మృతి చెందగా, ప్రదీప్ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆటోలో ప్రయాణిస్తున్న కొందరు ప్రయాణికులకు కూడా గాయాలు కావడంతో వారిని పాలకొల్లు ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ఆటో డ్రైవర్ చిలకంపాడుకు చెందిన మామిడిశెట్టి నాగరాజుగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నాయని ఎస్సై స్వామి వివరించారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

దెందులూరు: గుర్తుతెలియని మహిళ మృతదేహం గురువారం గుండుగొలను బ్రిడ్జి గోదావరి కాలువ సమీపంలో లభ్యమైందని దెందులూరు ఎస్సై రాజమల్లు శివాజీ అన్నారు. ఆ మహిళ వివరాలు తెలిసిన వారు దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

భార్యను వేధించిన భర్త, కుటుంబ సభ్యులకు జైలు శిక్ష

నూజివీడు: భార్యను అనుమానించి మానసికంగా, శారీరకంగా హింసించిన కేసులో నిందితులకు శిక్ష ఖరారు చేస్తూ నూజివీడులోని ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి న్యాయాధికారి ఒ.అనూష గురువారం తీర్పును వెలువరించారు. రూరల్ ఎస్సై జ్యోతీబసు తెలిపిన వివరాల ప్రకారం నూజివీడు మండలం పోతురెడ్డిపల్లికి చెందిన తల్లిబోయిన జ్యోతి వరప్రసాద్ తన భార్య హెప్సిబాను మానసికంగా, శారీరకంగా వేధించడంతో 2017లో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో తల్లిబోయిన జ్యోతీవరప్రసాద్‌తో పాటు మరో ఆరుగురిని నిందితులుగా చేర్చారు. ఈ కేసులో తల్లిబోయిన జ్యోతి వరప్రసాద్, తల్లిబోయిన ప్రభాకర్‌రావులకు రెండేళ్ల కారాగార శిక్ష, రూ.2వేల జరిమానా, తల్లిబోయిన వసంతరావు, గండికోట లీలా వెంకటేశ్వరరావులకు ఒక ఏడాది కారాగార శిక్ష, రూ.1000ల జరిమానా, తల్లిబోయిన లక్ష్మయ్య, తల్లిబోయిన పార్వతి, సువర్ణకుమారిలకు ఆరు నెలల కారాగార శిక్ష, రూ.500ల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. అలాగే భార్యను కొట్టి, వేధించిన కేసులో నూజివీడు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన మరో కేసులో తల్లిబోయిన జ్యోతివరప్రసాద్‌కు ఒక ఏడాది కఠిన కారాగార శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే మరో మూడు నెలల పాటు సాధారణ జైలు శిక్షను విధిస్తూ ఉత్తర్వులను వెలువరించారు.

ఛిద్రంగా దారి.. నడిచేదెలా మరి?

- గుంతలతో బెంబేలు
- ప్రమాదాలు జరగకుండా రక్షణ ఏర్పాట్లు చేయాలి


పెద్ద శివాలయం నుంచి ఓవర్ బ్రిడ్జి సమీపంలో


గీత ఫంక్షన్ హాల్ వద్ద


గుంతలో చేరిన వర్షపు నీరు


గూడ్స్ షెడ్డుకు వెళ్లే మార్గంలో

తాడేపల్లిగూడెం (టీటీసీ): ఇటీవల కురిసిన వర్షాలకు ప్రధాన రహదారులు ఛిద్రమై అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ప్రయాణం నరకాన్ని తలపిస్తోందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పెద్ద శివాలయం నుంచి గీత ఫంక్షన్ హాల్ మార్గం మీదుగా ఓవర్ బ్రిడ్జి ప్రక్కగా రైల్వే ట్రాక్ వరకు ఉన్న ఇరుకు, మలుపు నల్లచిప్స్ రహదారి చాలా కాలంగా ఛిద్రమై, పెద్ద పెద్ద గొతులు ఏర్పడ్డాయి. గూడ్స్‌షెడ్డు నుంచి వెళ్లే లోడ్ లారీలు, తిరిగి వచ్చే అన్‌లోడ్ (ఖాళీ) లారీలు కారణంగా ఈ పెద్ద గొయ్యిలు ఏర్పడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గోతులలో నీరు చేరడం, బురద, బురదగా మారడం జరుగుతుంది. ఈ మార్గంలో ప్రయాణించే వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. లారీలు కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఆందోళన చెందుతున్నారు. ఎండ ఉన్నప్పుడు బురద ఎండి పోవడంతో దుమ్ము, ధూళి ఎగసిపడటంతో ప్రజలు శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శివాలయం వద్ద ఉన్న కొత్త బ్రిడ్జి నుంచి లారీలు దిగువకు వచ్చే సమయంలో వేగం కారణంగా బ్రిడ్జికి ఎదురుగా ఉండే నివాసితులలో భయోందోళనలు నెలకుంటున్నాయి. లోడ్ లారీలతో బ్రిడ్జి ఎక్కే సమయంలో బ్రేక్‌లు పడక పోతే తమ పరిస్థితి ఏమిటో ? అని అక్కడ వారు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదాలు సంభవించకుండా ఆ మార్గంలో రహదారిని నిర్మించాలని, ఇళ్లపైకి లారీలు రాకుండా తగిన రక్షణ ఏర్పాట్లు చేయాలని ప్రజలు సంబంధిత అధికారులను, ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు.

దుర్గమ్మతల్లీ.. కాపాడమ్మా..

తణుకు అర్బన్: దుర్గాదేవి నవరాత్రి వేడుకలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. నాలుగురోజైన గురువారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. దుర్గమ్మతల్లీ కాపాడమ్మా అని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ ప్రార్థనా మందిరంలో వాసవీ మాతను గురువారం బాలా త్రిపురసుందరీదేవిగా అలంకరణ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని విశేషంగా అంలకరించి పూజాధికాలు జరిపారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై వాసవీ మాతను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గమిని రాంబాబు, భక్తులు, ఆర్యవైశ్యులు పూజాధికాల్లో పాల్గొన్నారు.

ఘనంగా దేవీ నవరాత్రులు

అత్తిలి: దేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా అత్తిలి మండలం ఆరవల్లి గ్రామంలో కనకదుర్గ అమ్మవారిని కాత్యాయనీదేవిగా అలంకరించారు. ఉదయం అమ్మవారికి మహిళలు కుంకుమ పూజలు, చండీహోమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, భవానీ భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వెలగల అమ్మిరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో దేవి నవరాత్రి మహోత్సవాలు

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణంలో దేవి నవరాత్రి మహోత్సవాలు గురువారం నాల్గోవ రోజు కొనసాగుతున్నాయి. వివిధ ఆలయాల్లో, అమ్మవార్లుకు విశేష పూజలు జరిగాయి. పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారిని శ్రీ ధనలక్ష్మి దేవిగా విశేష అలంకరణ గావించారు. ఆలయం లోపల రూ 57 లక్షల కరెన్సీ నోట్లుతో అలంకరించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు శ్రీరంగం అంజిబాబు పర్యవేక్షించారు. శ్రీ వాసవి కన్యక పరమేశ్వరీ ఆలయం అమ్మవారిని శ్రీ గాయత్రి దేవిగా విశేష అలంకరణ గావించారు. స్థానిక శంకరమఠంలో సర్వమంగళా అమ్మవారిని శ్రీ కాశీ అన్నపూర్ణదేవిగా విశేష అలంకరణ గావించారు. శ్రీదేవి మహంకాళమ్మ తల్లి ఆలయంలోని అమ్మవారిని శ్రీ మహాలక్ష్మిదేవిగా విశేష అలంకరణ గావించారు.

వివిధ రూపాల్లో అమ్మవార్లు దర్శనం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబాపురం శ్రీముత్యాలమ్మ వారిని గురువారం అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. శ్రీదేవీ శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా అమ్మవారిని విశేషంగా అంకరించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.హరేరాంప్రసాద్ తెలిపారు. సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహించారు. మహిళలు విరివిగా పాల్గొని కుంకుమ పూజలు జరిపారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు. వీరంపాలెం శైవక్షేత్రంలోని బాలాత్రిపుర సుందరీ దేవిని కూష్మాండాదేవిగా అలంకరించారు. పీఠం వ్యవస్థాపకులు గరిమెళ్ళ వెంకటరమణ శాస్త్రి, ప్రతినిధులు గరిమెళ్ళ కృష్ణ సందీప్, శశికుమార్ శర్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు. నందమూరు గ్రామంలోని గోగులమ్మ వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటి సభ్యులు శనగన రాంబాబు, కొప్పినేటి నాగు, మామిడి శంకరం, అడపా ఉదయ్‌భాస్కర్, కుంట్ల వీరవెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.


అత్తిలి: కాత్యాయనీదేవి అలంకరణలో కనకదుర్గమ్మ


తాడేపల్లిగూడెం(టీటీసీ): కరెన్సీ నోట్లతో అలంకరణ


తాడేపల్లిగూడెం(టీటీసీ): గాయత్రీ దేవిగా వాసవి అమ్మవారు


తాడేపల్లిగూడెం(టీటీసీ): శ్రీ ధనలక్ష్మిదేవిగా బలుసులమ్మ


తాడేపల్లిగూడెం(టీటీసీ): మహాలక్ష్మీదేవిగా మహంకాళమ్మ తల్లి


తణుకుఅర్బన్: బాలా త్రిపురసుందరీ దేవి అలంకరణలో వాసవీ మాత


తాడేపల్లిగూడెం(టీటీసీ): అన్నపూర్ణదేవిగా సర్వమంగళమ్మ


తాడేపల్లిగూడెం రూరల్: వీరంపాలెం శ్రీబాలాత్రిపుర సుందరీదేవిని కూష్మాండ దేవిగా అలంకరించిన దృశ్యం


తాడేపల్లిగూడెం రూరల్: ముత్యాలమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించిన దృశ్యం


తాడేపల్లిగూడెం రూరల్: నందమూరు గోగులమ్మ వారికి పూజలు నిర్వహించిన దృశ్యం

ఈ-క్రాప్‌లో పంట నమోదు చేసుకోవాలి

యలమంచిలి: వరి సాగు చేసే రైతులందరూ ఈ క్రాప్‌లో పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి దుంగా బాలా త్రిపుర సుందరి సూచించారు. మేడపాడు రైతు సేవా కేంద్రంలో గురువారం ఆమె ధాన్యం కొనుగోలుపై నిర్వహించిన అవగాహనా సదస్సులో మాట్లాడారు. ఈక్రాప్‌లో పంట నమోదు చేయించుకున్న రైతుల ధాన్యం మాత్రమే రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం 2025-26 సంవత్సారానికి గ్రేడ్ ఏ రకానికి క్వింటాల్‌కి రూ.2,389, సాధారణ రకానికి క్వింటాల్‌కి రూ.2,369 కనీస మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. రైతులు ధాన్యంలో తేమ 17 శాతం ఉండేలా చూసుకోవాలన్నారు. చెడిపోయిన, రంగు మారిన, మొలకెత్తిన, పురుగుతిన్న ధాన్యం 5 శాతంలోపు, పరిపక్వము కాని ముడుచుకుపోయిన వంకర తిరిగిన ధాన్యం గింజలు 3 శాతంలోపు ఉంటే ధాన్యం కొంటామని తెలిపారు. మేడపాడు సొసైటీ చైర్మన్ అడ్డాల రాజశేకర్ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం నిర్ణయించిన ప్రమాణాలు తప్పకుండ పాటించాలని కోరారు. ధాన్యం రవాణ వాహనాలకు జీపీఎస్ పరికరాన్ని అమర్చాలన్నారు. గోనె సంచులకు కొరత రానివ్వమని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు దేగల సూర్యప్రభ వెంకటేశ్వరరావు, రైతులు, వ్యసాయ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ బాలా త్రిపుర సుందరి

కుట్టు మెషీన్ల పంపిణీ

నరసాపురం రూరల్: పేద మహిళ ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా రాజ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవలు అందిస్తున్నామని ట్రస్ట్ ఫౌండర్ గంటా రాజ్ కుమార్ అన్నారు. గురువారం నరసాపురం మండలం రుస్తుంబాద గ్రామంలో ట్రస్టు ఆధ్వర్యంలో 22 మంది మహిళలకు కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఒరిస్సా ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల్లో ఇప్పటివరకు 2200 మంది మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి కుట్టు మెషీన్లు అందించామన్నారు. ఎంపీపీ మైలాబత్తుల బత్తుల సోనీ, దళిత సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్ కుమార్, వైఎస్సార్‌సీపీ ప్రచార కమిటీ కార్యదర్శి ఇంజేటి జాన్ కెనడీలు మాట్లాడుతూ రాజ్ ట్రస్ట్ సేవలను మరింత విస్తృతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కాకిలేటి ఆనందకుమార్ (మధు), వర్ధన సుధాకర్, పిట్టా రామారావు, వర్ధనపు సుదాకర్, పిల్లి చిట్టి రాజు, బందారు పెద్దిరాజు, తిరుమాని నరసింహారాజు, మైలాబత్తుల శ్రీను, కాటన్ చంటి, మురాల స్వామి, పెదపాటి రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.


మహిళలకు కుట్టు మెషీన్లు పంపిణీ చేస్తున్న రాజ్ ట్రస్ట్ సభ్యులు

కొత్త ఆలోచనలో సమాజానికి ఉపయోగపడాలి

భీమవరం: విద్యార్థులు కొత్త ఆలోచనలు, సృజనాత్మకత, టెక్నాలజీ వినియోగంతో సమాజానికి ఉపయోగపడే పరిష్కారాలు తీసుకురావాలని విద్యార్థుల్లో ఉన్న ఆవిష్కరణ శక్తిని ప్రోత్సహించే వేదికగా స్పార్క్ ట్యాంక్ వంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, విజయవాడ ఇన్క్యుబేషన్ హెడ్ దొనేపూడి రవితేజ అన్నారు. భీమవరం విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో గురువారం ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్, ఇన్నోవేషన్ అండ్ ఎంట్రప్రెన్యూర్షిప్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్పార్క్ ట్యాంక్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటువంటి పోటీలు విద్యార్థుల్లో పరిశోధన, స్టార్టప్ భావజాలం, జాతీయ స్థాయిలో పోటీ చేసే నైపుణ్యాలను పెంపొందిస్తాయన్నారు. ఇన్నోవేషన్ అండ్ ఎంట్రప్రెన్యూర్షిప్ డెవలప్‌మెంట్ సెల్ ఇన్‌చార్జ్ వివిఎస్ఎన్ నర్సింహరాజు మాట్లాడుతూ స్పార్క్ ట్యాంక్ వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలను వెలికితీస్తాయని, నేటి యువత సమాజ సమస్యలకు వినూత్న పరిష్కారాలను కనుగొని స్టార్టప్‌ల రూపంలో ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మంగం వేణు, వైస్ ప్రిన్సిపల్ ఎం శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ ఆశయాలు భావితరాలకు తెలియాలి

భీమవరం: మహనీయుల త్యాగాలు మహాత్మాగాంధీ ఆశయాలు భావితరాలకు తెలియడం కోసం వారోత్సవాలు, పక్షోత్సవాలు నిర్వహించడం ఒక స్పూర్తి అని భీమవరం సబ్ ట్రెజరీ అధికారి అల్లూరి రవివర్మ అన్నారు. భీమవరం క్విట్ ఇండియా స్థూపం వద్ద గురువారం శ్రీవిజ్ఞానవేదిక, జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో నిర్వహించే సందర్భంగా ఆయన మాట్లాడారు. శాంతి, అహింస ఆయుధాలుగా స్వాతంత్య్రం సాధించిన మహాత్మాగాంధీ ఆశయాలు నేటి యువత నెరవేర్చాలన్నారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జాతిపిత మహాత్మాగాంధీ జయంతోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరీ ఉద్యోగులు యుపీ పాండురంగారావు, ప్రసాద్, ఇందుకూరి ప్రసాదరాజు, గాతల జేమ్స్, మాజీ కౌన్సిలర్ విజ్జురోతి రాఘవులు, ఎస్ కె చాన్‌భాషా, భట్టిప్రోలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


భీమవరంలో మహాత్మాగాంధీ జయంతోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించిన దృశ్యం

క్లుప్తంగా

ఘనంగా దీన్‌దయాళ్ జయంతి వేడుకలు


దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి

తాడేపల్లిగూడెం (టీటీసీ): భారతీయ జన సంఘ్ వ్యవస్థాపక నేత పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పట్టణంలో గురువారం బీజేపీ నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ దేశం కోసం దీన్ దయాల్ ఉపాధ్యాయ చేసిన సేవలను కొనియాడారు. నాయకులు కంచుమర్తి నాగేశ్వరరావు, ఐనం బాలకృష్ణ, రామగాని సత్యనారాయణ, చిట్యాల రాంబాబు, పాటీ నాగేశ్వరరావు, పత్స రామకృష్ణ, ముళ్లపూడి రత్నాజీ, చిక్కాల చిరంజీవి, నరసింహమూర్తి, తమరాడు చిన్నా, జయప్రకాశ్, రామకృష్ణ, వెంకటలక్ష్మి, నాగదుర్గ, మహాలక్ష్మి, లక్ష్మీదుర్గ, కల్యాణి, విజయ తదితరులు పాల్గొన్నారు.

'గూడెం'లో 11.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో 11.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్ గురువారం తెలిపారు. పెంటపాడులో 16.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


తణుకులో స్వచ్ఛతోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: తణుకు ఎస్ఎంవీఎం పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులు, 19 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ ఏలూరు సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛతోత్సవంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.తులసిరాధ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని, సామాజిక బాధ్యత మెలగాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రాంగణం నుంచి ప్రారంభించిన ర్యాలీ నరేంద్ర సెంటర్ వరకు సాగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ఎన్‌సీసీ అధికారి వి.గణపతి సాయి, విద్యార్థులు, అధ్యాపకులు, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

రామన్నగూడెంలో 300 మందికి వైద్య పరీక్షలు


రామన్నగూడెంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీహర్ష

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని రామన్నగూడెం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీహర్ష స్త్రీలకు వచ్చే వ్యాధులు, క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. అనంతరం 300మందికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు ఉచితంగా అంజదేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మద్దిపాటి రవితేజ, మద్దిపాటి ధర్మేంద్ర, పంచాయతీ కార్యదర్శి కెల్లా చక్రవర్తి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి


శశి ఇంజనీరింగ్ కళాశాలలో రక్తదాన శిబిరం

తాడేపల్లిగూడెం: స్థానిక శశి ఇంజనీరింగ్ కళాశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఆశ్రం ఆసుపత్రి సంయుక్త సౌజన్యంతో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. పెద్ద సంఖ్యలో విద్యార్థులు రక్తదానం చేశారు. ఆశ్రం ఆసుపత్రి, శశి సంస్థ మధ్య అవగాహన ఒప్పందం జరిగింది. శశి సంస్థల వైస్‌చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆహారంలో నాణ్యత పాటించాలి

యలమంచిలి: చిన్న పిల్లలకు అందించే ఆహారంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.శ్రీలక్ష్మి సూచించారు. ఐసీడీఎస్ పాలకొల్లు ప్రాజెక్టు పరిధిలోని లక్ష్మీపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన స్వచ్ఛతాహి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాల్య దశ నుంచే పిల్లలకు మంచి ఆహారపు అలవాట్లు నేర్పించాలన్నారు. పిల్లలను జంక్ ఫుడ్‌కి పూర్తిగా దూరంగా ఉంచాలని, జంక్ ఫుడ్ వల్ల ఊబకాయం వస్తుందని వివరించారు. కార్యక్రమంలో సీడీపీఓ ఉమ, అంగన్‌వాడీ టీచర్ బెజవాడ కళావతి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా అంతరాయం

తణుకు అర్బన్: తణుకు సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లలో విద్యుత్ లైన్స్ మరమ్మతులు, నిర్వహణలో భాగంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ డివిజనల్ ఇంజనీరు కె.నరసింహమూర్తి తెలిపారు. తణుకు పట్టణ పరిధిలోని ఇరగవరం రోడ్డులోని హౌసింగ్ కాలనీ, తణుకు రూరల్ పరిధిలోని ఇందిరానగర్, తేతలి ఇండస్ట్రియల్, సూర్యప్రభ ఇండస్ట్రియల్ ఎస్టేట్, మండపాక, పైడిపర్రు గ్రామాలకు చెందిన ఇండస్ట్రియల్ సర్వీసులు, మండపాక హౌసింగ్ కాలనీ, వేల్పూరు ప్రాంతాల్లోను, అత్తిలి మండలం పాలి, అత్తిలి, కొమ్మర, ఈడూరు, కంచుమర్రు, స్కిన్నెరపురం, సీహెచ్ చెర్వు గ్రామాలు, ఇరగవరం మండలం కావలిపురం, గోపాలపురం గ్రామాల్లోని ఇండస్ట్రియల్ సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

పట్టుదలతో విద్యార్థులు లక్ష్యాలను సాధించాలి


నన్నయ్య విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఫార్మాసిస్టు డే

తాడేపల్లిగూడెం: స్థానిక ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయ ప్రాంగణంలో గురువారం ప్రపంచ ఫార్మాసిస్టు దినోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా భీమవరం డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ అబిద్ ఆలీ షేక్ హాజరయ్యారు. పుస్తకాల విలువ, కళాశాలలో సంపాదించుకోవాల్సిన జ్ఞానం, వంటి విషయాల గురించి వివరించారు. కృషి, పట్టుదలతో విద్యార్థులు లక్ష్యాలను అధిగమించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యూరో సైక్రియాటిస్టు శ్రీతా, కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, అతిథులు పాండురంగారావు, రాజీవ్, అసిస్టెంటు ప్రొఫెసర్ హీరాభట్టు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లు కూల్చడం అన్యాయం

కాళ్ల: మండలంలోని బొండాడ గ్రామంలో భూస్వాముల ప్రయోజనాల కోసం పేదల ఇళ్లను కూల్చివేయడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్ అన్నారు. బొండాడ గ్రామంలో కూల్చిన పేదల ఇళ్లను, ఖాళీగా ఉన్న ఇరిగేషన్ భూములను గురువారం గోపాలన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పేదలపై యుద్ధం పేరుతో ఇల్లు కూల్చివేయడం దుర్మార్గమన్నారు. ఉండి నియోజకవర్గంలో అభివృద్ధి పేరుతో విధ్వంసం జరుగుతోందన్నారు. బొండాడ గ్రామంలో సుమారు 70 సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్న పేదల ఇళ్లను తొలగించి 25 రోజులైనా ఇప్పటికీ వారికి నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. నిర్వాసితులకు వెంటనే న్యాయం చేసి, మూడు సెంట్లు చొప్పున స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమం చేపడతామన్నారు.

ద్వారాలు, కిటికీలు లేని పాఠశాల భవనం

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని మండల పరిషత్ ఉన్నత పాఠశాల భవనానికి ద్వారాలు, కిటికీలు లేవు. పాఠశాల పునఃనిర్మాణ పనులు చేపట్టి రెండున్నరేళ్లు గడుస్తున్నా, నేటికీ పూర్తి కాలేదు. గతంలో పురాతన భవనం కూలడానికి సిద్ధంగా ఉండటంతో, ఆభవనాన్ని పూర్తిగా తొలగించి నాడు-నేడు నిధులతో పునః నిర్మాణం చేపట్టారు. రెండు అంతస్తుల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు కాగా ఒక అంతస్తు మాత్రమే నిర్మించారు. రెండు తరగతి గదులు నిర్మించి చేతులు దులుపుకున్నారు. అప్పటి నుంచి కిటికీలు, తలుపులు, గుమ్మాలు లేకుండా మొండి గోడలతో ఉన్నాయి. కుక్కలు, ఇతర జంతువులు లోపలికి వెళ్లకుండా బల్లలు అడ్డుపెట్టుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిని తరువాత నాడు-నేడు నిధుల్ని ఆపివేసి, ఎక్కడ పనులు అక్కడే నిలుపుదల చేశారు. పాత నిధులు మంజూరు చేయాలేదు. దీంతో ఎక్కడి పనులు అక్కడనే నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం మన బడి-మన భవిష్యత్ పథకం క్రింద నిధులు మంజూరు కావలసి ఉంది. అప్పటి వరకూ ఓరుగాలిలో విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగించాల్సిందే.

ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రత సాధ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం, ఆనందం అని, ప్రజలు తమ పరిసరాల పరిశుభ్రతపై బాధ్యత కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. స్వచ్ఛతహి సేవ 2025లో భాగంగా ఎక్ దిన్.. ఏక్ గంట.. ఏక్ సాత్ స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా గురువారం భీమవరం పట్టణంలో పెద్ద పోస్ట్ ఆఫీస్ వద్ద ఎడ్వర్డ్ ట్యాంక్ చుట్టూ మున్సిపల్ కార్పొరేషన్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు మెప్మా, మహిళలు చేపట్టిన శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ప్రజా భాగస్వామ్యంతోనే పరిశుభ్రత సాధ్యమని అన్నారు.

నేడు పీ4పై శిక్షణ

పాలకోడేరు: జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల ఆదేశానుసారం మండల స్థాయిలో పీ-4 అమలుపై మండలంలోని గ్రామ సచివాలయ సిబ్బంది అందరికీ పాలకోడేరు మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం5 గంటల వరకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీవో వి. రెడ్డియ్య ఒక ప్రకటనలో తెలిపారు.